క్లుప్తంగా

రేపు ఇబ్రహీంపట్నంలో బతుకమ్మ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో బతుకమ్మ సంబురాలను గురువారం సాయంత్రం ఆరు గంటలకు అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. అంతకు ముందు సాయంత్రం 4 గంటలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేయనున్నారు.

సీపీఎం ఆదిబట్ల కార్యదర్శిగా నర్సింహ



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ సీపీఎం కార్యదర్శిగా ఎంపీ పటేల్‌గూడకు చెందిన తులసిగారి నర్సింహను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిబట్లలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు నర్సింహను ఎన్నుకున్నారన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని నర్సింహ పేర్కొన్నారు. కమిటీ సభ్యులు గోపగళ్ల పెంటయ్య, కథాల్, రంజిత్, నవీన్, వెంకటేష్‌లను ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి. సామేలు, సిహెచ్ బుగ్గరాములు అభినందించారు.

ఫార్మాసిటీ సీఐగా కృష్ణంరాజు



యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐగా లిక్కి కృష్ణంరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ నర్సింహరావు మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. సీఐ కృష్ణంరాజు మహేశ్వరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మైసిగండి మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కడ్తాల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఎమ్మెల్యే మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చక సిబ్బంది, ఆలయ నిర్వాహకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరాసింగ్, తులసీరాం, రామ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి



ఇబ్రహీంపట్నం డీఎంకు వినతిపత్రం అందిస్తున్న సత్యం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఆర్టీసీ డిపోలో డీఎంకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సు సంతోష్‌నగర్ నుంచి దొడ్లపహాడ్ వరకు వస్తున్నక్రమంలో వయా శెట్టిపల్లి గ్రామం వరకూ పొడిగించాలని వినతిప్రతంలో కోరారు. ఈ విషయంలో స్పందించిన డీఎం రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, నర్సింహ, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: దసరా పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కాంగ్రెస్ యువ నాయకుడు ఉడుతల సతీష్‌గౌడ్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు ఆయన దుస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, అశోక్ ముదిరాజ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: మైసిగండిలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



ఇబ్రహీంపట్నం: లక్ష్మీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో మహాచండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

దేవి శరన్నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. ఆరో రోజు మంగళవారం దుర్గామాత మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఆమనగల్లు: మార్కండేయస్వామి దేవాలయంలో అమ్మవారి పూజలో ఎంపీడీవో మాధురి, భక్తులు



ఆమనగల్లులో మహాలక్ష్మిదేవి అలంకారంలో దుర్గామాత



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తలకొండపల్లి: మెదక్‌పల్లిలో అమ్మవారిని పూజిస్తున్న భక్తులు



ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు



మాడ్గుల: కోల్కులపల్లిలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



ఆమనగల్లు: బతుకమ్మ ఆడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

ఆమనగల్లు: సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని సీడీపీవో శాంతిరేఖ పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తల్ మండలాలలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బతుకమ్మలతో ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు బతుకమ్మలకు పూజలు నిర్వహించి ఆడిపాడి సందడిచేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శాంతిరేఖ, సూజర్‌వైజర్లు భక్తశబరి, జయమ్మ, సరళ, బాలమణి, కవిత, తిరుమల, పద్మ, అనిత, ఉమ, రాధిక తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: బతుకమ్మలకు పూజలు చేస్తున్న సీడీపీవో శాంతిరేఖ తదితరులు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో క్వెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అనంతరం క్వెస్ కార్పొరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. ఎంపికైన నిరుద్యోగులకు త్వరలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, మర్రి మాధవి, కుంట ఉదయశ్రీ , కొత్తకుర్మ శివకుమార్, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని స్వచ్ఛంద సేవా నాయకుడు బండ్లగూడ శ్రీధర్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ గ్రామంలో రవికాంత్‌రెడ్డి, శ్రీనారెడ్డిలు ఆధ్వర్యంలో చేవెళ్ల పోటీలు జరుగుతున్నాయి. మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్, చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని క్రికెట్ జట్టులు పోటీపడుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యురాలు బండ్లగూడ సుధాశ్రీధర్ క్రికెట్ కిట్‌తో పాటు డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ టోర్నమెంట్‌ను 45రోజులు నిర్వహిస్తారన్నారు.

ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని వినతి

కడ్తాల్: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు ఆర్‌వీ కర్ణన్‌కు కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. వెంటనే మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నరేందర్‌రెడ్డి, నర్సింహ, అశోక్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: డీజే నిర్వాహకులు న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు, ఈవెంట్లలో డీజే పెట్టాలనుకుంటే ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డీజే ఏర్పాట్లు మూడు కేటగిరీలుగా ఉన్నాయన్నారు. ఇందులో ఇండోర్‌లో నిర్వహించే ఈవెంట్లు, ఔట్‌డోర్ ఈవెంట్లు, ర్యాలీగా నిర్వహించే ఈవెంట్లలో న్యాయస్థానం సూచించిన విధంగానే డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించాలన్నారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై ముజఫర్‌అలీ, ఏఎస్సై శివారెడ్డి, డీజే నిర్వాహకులు పాల్గొన్నారు.



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

లైసెన్స్ తీసుకోవాలి

శంకర్‌పల్లి: సౌండ్ సిస్టం(డీజే) వాడాలంటే లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో పట్టణం, మండలంలోని సౌండ్ సిస్టం(డీజే) యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డీజేల వాడకంపై పోలీసు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఎవరైనా డీజేలు వాడాలంటే రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని, లేకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై సుందరయ్య, సౌండ్ సిస్టం యజమానులు పాల్గొన్నారు.

ఆధునికతను అందిపుచ్చుకోవాలి

మొయినాబాద్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే ఆధునికతను అందిపుచ్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.జహంగీర్ అన్నారు. చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మంగళవారం నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఓరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే ఉన్నత భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు.

నిధులు మంజూరు

- గ్రామ పంచాయతీలకు రూ.45,25,136 విడుదల
- తప్పనున్న ఇబ్బందులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రత్యేకాధికారులు



గునుగల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

యాచారం: దసరా ముందు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. పంచాయతీల్లో పైసా నిధులు లేక పాలన గాడితప్పుతున్న నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధుల మంజూరు కొంత ఉపశమనం కలిగించినట్లయిందని పలువురు అధికారులు వాపోతున్నారు. గ్రామాల్లో పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లో ఉండడంతో రేవంత్‌రెడ్డి సర్కార్ స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించుకోకపోవడం బాధాకరమన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు పదవుల్లో ఉంటే పండుగ సమయాల్లో వారే నిధులు ప్రజావసరాలకు వినియోగించేవారు. కాని ప్రస్తుతం ప్రత్యేకాధికారుల చేతుల్లో పాలన ఉండడంతో ప్రజలు కూడా సమస్యలపై గట్టిగా నిలదీస్తున్నారు.

ఆర్థిక ఉపశమనం..

కొద్ది రోజుల కింద రాష్ట్ర సర్కార్ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. మండలంలోని గ్రామ పంచాయతీలకు రూ.45,25,136లు నిధులను మంజూరు చేసింది. మేజర్ గ్రామ పంచాయతీలైన గునుగల్‌కు రూ. 2,23,874 యాచారానికి రూ. 3,09,227, మాల్‌కు 4,40,124, నక్కర్తమేడిపల్లికి రూ. 3,23,616, నందివనపర్తికి 2,17,503, నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో గ్రామాల్లో అత్యవసర పనులు, పలు అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ఇదే విషయమై మండల పంచాయతీ అ ధికారి శ్రీలతను సంప్రదించగా రాష్ట్ర ఆర్థిక నిధుల విడుదలతో గ్రామ పంచాయతీల్లో కొంచెం ఆర్థిక ఇబ్బందులు తప్పినట్లు ఉందని వారు తెలిపారు.

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న డంపింగ్‌యార్డును వెంటనే తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తను డంప్‌తో విపరీతమైన దుర్వాసన వస్తోందని, ఈగలు, దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రోగాల బారినపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. డంపింగ్‌యార్డును తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగపాగ జగయ్య, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, సోమ్లానాయక్, ఆనంద్, రమేశ్, మోహన్, హరీశ్, శ్రీహరి, శివ, రాము ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, కార్మికులు

షాబాద్: అంతారం డబ్ల్యూటీపీ ప్లాంట్ మిషన్ భగీరథ కార్మికుల రెండునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ 40 ఎమ్ఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో కేఎస్ఆర్ కాంట్రాక్టు కింద 15 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి రెండు నెలల పెండింగ్ వేతనాలను కేఎస్ఆర్ యాజమాన్యాన్ని అడగగా.. తాము జూలై నుంచి ఎస్సీసీ యాజమాన్యానికి అప్పజెప్పామని చెప్పారు. ఎస్సీసీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. కేఎస్ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యం అఫీషియల్‌గా మాకు అప్పగించలేరని చెప్పారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కార్మికులకు రెండునెలల వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించని యాజామాన్యాల కాంట్రాక్ట్‌ను మిషన్ భగీరథలో పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు ఉన్నారు.


ప్రజా సంక్షేమమే ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావొస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర పథకాలను అర్హులైన వారికి అందించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు.

విఠ్యాల గ్రామంలో..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, కిష్టయ్య, రాములు, లింగం, దశరథ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: చటాన్‌పల్లిలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

షాబాద్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్‌గూడ, సంకెపల్లిగూడ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు.